
ప్రజాశక్తి
శనివారం 4 అక్టోబర్ 2025



బురద గెడ్డ వద్ద ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం ఎండపల్లివలస, అరకు మధ్య బ్రిడ్జి వద్ద శుక్రవారం భారీ ట్రాపిక్ జామ్ ఏర్పడింది. దీంతో అరుకు సంతబయలు నుంచి అరకు రైల్వే స్టేషన్ వరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి పోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు ఒకేసారి రావడంతో ట్రాఫిక్ నియంత్రించ లేక పోలీసులు అష్ట కష్టాలు పడ్డారు. దాదాపు 3గంటల పాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. బ్రిడ్జి మరమ్మతులకు 10 లక్షలు జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేసినప్పటికీ మరమ్మతులు పనులు జరగక పోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని వాహనాచోధకులు, పాదచారులు తెలిపారు.



నిలిచిన వాహనాలు

అభివృద్ధికి.. ఆమడ దూరంలో మళ్లిపాడు

- రోడ్డు సౌకర్యం లేక తప్పని అవస్థలు
- ఊట గెడ్డ నీటిని సేకరిస్తున్న గిరి మహిళలు
- రేకుల షెడ్డులో విద్యా బోధన, విద్యార్థులకు ఇబ్బందులు




గెడ్డలో నీటిని మోసుకొస్తున్న మహిళలు

ప్రజాశక్తి -అనంతగిరి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు నోచుకోక అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజన గ్రామాలు మగ్గుతున్నాయి. అనంతగిరి మండలం లుంగపర్తి పంచాయతీ పరిధి మళ్లిపాడు గ్రామంలో కనీస సౌకర్యాలు అందని ద్రాక్షగా మిగిలాయి. రోడ్డు, తాగునీటి, పాఠశాల, అంగన్వాడి భవనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు

మెట్టవలస మెయిన్ రోడ్డు నుండి మళ్లిపాడు గ్రామం వరకు సుమారు 6 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఎత్తైన కొండకోనలు దట్టమైన అటవీ ప్రాంతం మీదుగా రైవాడ జలాశయానికి ఉప్పొంగి ప్రవేహించే గోస్తని గెడ్డ దాటుకుంటూ నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. గర్భిణీ, బాలింత, రోగులకు డోలి సహాయంతో గ్రామం నుండి మెట్టవలస వరకు ఆరు కిలోమీటర్లు దూరం తరలించి అక్కడ నుండి లుంగపర్తి ప్రభుత్వ ఆసుపత్రులకు అంబులెన్స్, ఆటోలలో తరలిస్తున్నారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు గత వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికారులకు లిఖిత పుర్వకంగా విన్నవించినా పట్టించుకున్న నాధుడే కరువయ్యారు.



గెడ్డను దాటి వెళుతున్న గిరిజనులు

తాగునీటి సమస్యతో అవస్థలు

కనీసం తాగునీటి సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామంలో 30 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎటువంటి పైపులైను, బోరు, బావి వంటి పథకాలు లేక పోవడంతో గ్రామానికి కిలోమీటర్ల దూరం ఎగువ కొండ ప్రాంతం ఉన్న ఊట నీటిని సేకరించి జీవనం కొనసాగిస్తున్నారు. షెడ్డులలో పాఠశాల, అంగన్వాడి కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భవనాలు మంజూరు కాక 25 మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు 34 మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస రోడ్డు సౌకర్యం లేక పోవడంతోనే మంజూరైన పాఠశాల, అంగన్వాడి భవనాల నిర్మాణానికి సంబంధించిన సామాగ్రి రవాణా నిలిచి పోయింది. భవనాలు లేక ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం, అంగన్వాడీల పౌష్టికాహారం నిల్వ ఉంచేందుకు నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా భవనాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కర్రలే విద్యుత్ స్తంభాలు..

నేలపాలెం గ్రామం నుండి ఈ గ్రామానికి విద్యుత్తు లైన్ లేక గ్రామంలో కర్రలే విద్యుత్ స్తంభాలుగా ఉపయోగించి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మంజూరు కానీ గృహాలు..

పేదప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న పీఎం జన్మన్ గృహాలకు గ్రామస్తులు నోచుకోలేదు. గ్రామానికి చెందిన గిరిజనులు మట్టి గోడలు, పూరిగుడెసెల్లో తుఫాను, వర్షాలకు బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు.



షెడ్డులోనే పాఠశాల

వినతులకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్- పిజిఆర్ఎస్ కు 67 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 67 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్, అసిస్టెంట్ కలెక్టర్ కె.సాహిత్, డిఆర్ఓ కె.పద్మలతో కలిసి సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలన్నారు. ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఎపి డాట్ జిఒవి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని..

హుకుంపేట మండలం మత్స్యపురం పంచాయతి మత్స్యపురం గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ పి.చందన్న పాత్రుడు సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ, ముంచింగిపుట్టు మండలం ఏనుగురాయి పంచాయతి కొండపడ గ్రామస్తులు కె.బాలరాజు, పి.రామచంద్రరావు, పి.సోన్ను శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మించాలని కోరుతూ అర్జీ పెట్టారు. కొయ్యూరు మండలం ఆడాకుల పంచాయతి డి.కొత్తూరు, రామ్‌నగర్, మల్లవరం గ్రామస్తుడు కె.స్వాతి కుమార్ త్రీ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్ మంజూరు కోరుతూ, డుంబ్రిగుడ మండలం గసబ పంచాయతి చిమిలిగుడ గ్రామం నుండి వయా సిరసగుడ గ్రామం వరకు తారురోడ్డు నిర్మాణంకు గ్రామసర్పంచ్ ఎన్.సునీత దరఖాస్తు చేసారు. ముంచింగిపుట్టు మండలం పెదగుడ పంచాయతి పెదగుద గ్రామస్తుడు సికిల్ సెల్ అనేమియా ట్రీట్మెంట్ అయ్యిందని, ప్రభుత్వం మంజూరు చేసిన పది వేల రూపాయలు ఖాతాలో జమ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ డిడి పిబి పరిమళ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఆర్‌డిఎ పిడి వి.మురళీ, ఆర్అండ్‌బి ఇఇ బాల సుందరబాబు, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ ఆఫీసర్ పిఎస్ కుమార్, డిపిఒ కెపి చంద్ర శేఖర్, డిఎంహెచ్ఓ విశ్వేశ్వరనాయుడు, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ.జయప్రకాష్ తహసిల్దార్లు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం పంచాయతీ ప్రధానిపుట్ గ్రామంలో శుక్రవారం నేచర్ స్వచ్ఛంద సంస్థ, యూనిసెఫ్ సహకారంతో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో సికిల్ సెల్ ఎనీమియా, మహిళా ఆరోగ్యం ప్రాధాన్యతపై వైద్యులు, నిపుణులు అవగాహన కల్పించారు. నేచర్ కార్యకర్త లబుడుభారికి పద్మ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కుటుంబానికి మూలం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ వంతల సంగీత మాట్లాడుతూ, మహిళలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నెలసరి సమయంలో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఐరన్ టాబ్లెట్లు వాడాలని సూచించారు. తగిన నిద్ర, విశ్రాంతి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేచర్ ప్రతినిధులు టి.సంతోష్ కుమార్, కొర్ర అద్దు, సునీల్, కృష్ణ బాబు పద్మ, హిమ బిందు, శైలజ, హరి, మోస్య, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి, ఆశ వర్కర్ అప్పలమ్మ, వార్డ్ మెంబర్స్ పిసా కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తగ్గుముఖం పట్టిన గోదావరి

పలు గ్రామాలకు పునరుద్ధరణ కాని రాకపోకలు

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలో బుధవారం నుండి గోదావరి శబరి కాస్త తగ్గుముఖం పట్టాయి. శ్రీరామగిరి, సీతంపేట, వడ్డిగూడెం, ఇప్పూరు, రామవరం, తుష్టివారిగూడెం, కన్నాయిగూడెం, గ్రామాల ప్రధాన రహదారులపై నుండి వరద ఇంకా తగ్గకపోవడంతో ప్రజలు ఎటూవెళ్లే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారు. ముంపు బాధితులు మాట్లాడుతూ ఇంకా ఎన్నాళ్ళు ఇబ్బందులు పడాలని మూడు నెలలుగా పనులు లేక అవస్థలు పడుతున్నామని నెల క్రితం ఎమ్మెల్యే వచ్చినప్పుడు మూడు రోజుల్లో బియ్యం ఇస్తామని చెప్పారని ఇంతవరకూ బియ్యం, నిత్యావసర వస్తువులు ఇవ్వలేదని తక్షణమే 25 కిలోల బియ్యం నిత్యావసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రాచలం వద్ద గోదావరి శుక్రవారం సాయంత్రానికి 36.40 అడుగులకు చేరుకుంది అయినా రహదారులపై నుండి నీరు తగ్గకపోవడంతో ముంపు గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు



వినతిపత్రం అందజేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

ప్రజాశక్తి-విఆర్.పురం: మండలంలోని ములకనపల్లి సచివాలయం పరిధిలో ఉన్న ప్రజాసమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సిపిఎం జోన్‌కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రం సచివాలయ అధికారులకు అందించారు. అధికారులు స్పందిస్తూ ఉన్నత అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తామన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఏడుసార్లు వరదలు వచ్చాయని నిత్యావసర సరుకులు, పంట నష్టపరిహారం ఇవ్వడం లేదని, భూమి పట్టాలు మార్పు చేయడం లేదని సాగుచేస్తున్నా పోడు భూముల పట్టాలు ఇవ్వాలని పెద్దమట్టపల్లి నుండి నర్సింగపేట, కారంగూడెం నుంచి ఏజి కోడేరు, ములకనపల్లి సెక్టార్ నుండి వీరపాపనకుంట, జల్లివారిగూడెం బీటి రోడ్ నుండి కుంజవారిగూడెం మీదుగా కుంద్దులూరు బీటిరోడ్డు జంక్షన్ వరకూ అదేవిధంగా కుందులూరు నుండి టేకులూరు వరకు రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేసారు ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, మండల కమిటీ సభ్యులు కమ్మచిచ్చు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందించాలి

మండలంలోని రామవరం పంచాయతీలో శుక్రవారం సిపిఎం బృందంతో పాటు ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మ సచివాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా వరదలు వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నిత్యావసర వస్తువులు అందించాలని, రహదారులు బాగు చేయాలని నష్టపరిహారం అందించేలాగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, వడ్లది రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సాధనకమిటీ సభ్యులు

13న ఐటిడిఎ ముట్టడికి తరలిరావాలి

- ఆదివాసీ హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ

దేవీపట్నం- ప్రజాశక్తి: ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 13న రంపచోడవరం ఐటిడిఎ ముట్టడి కార్యక్రమానికి ఆదివాసులందరూ తరలి రావాలని ఆదివాసీ హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ డివిజన్ అధ్యక్షుడు మడి మురళి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం, దేవీపట్నం మండలం పరిధిలోని పెద్దభీంపల్లి-2, పెద్దభీంపల్లి 3 మడిపల్లి ఆర్అండ్ఆర్ కాలనీల్లో సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2025 మెగా డిఎస్‌సిలో రూల్‌ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంపై గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటిడిఎల వద్ద ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, రిలే నిరాహార దీక్షలు చేపట్టి ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేసినప్ప టికీ ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించాలని,ఆదివాసీ యువతకు ట్రైకార్ రుణాలు తక్షణమే మంజూరు చేయాలని తదితర సమస్యలపై ఈ నెల 13న రంపచోడవరం ఐటిడిఎ ముందు జరిగే ముట్టడి, ర్యాలీ కార్యక్ర మానికి అంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ మండల ప్రధాన కార్యదర్శి మిర్తివాడ సాయికిరణ్‌రెడ్డి, శారపు నవీన్‌కుమార్, మడకం సూర్యకుమారి, మిర్తివాడ సూరారెడ్డి, రమాదేవి, వరలక్ష్మి, సర్పంచ్ తోకల నాగరత్నం, ఎపి ఆదివాసి జెఎసి రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర తదితరులు పాల్గొన్నరన్నారు.



జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి-సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నామని ఎపి జెన్‌కో ఎఇఇ శివశంకర్ వెల్లడించారు. గురువారం డొంకరాయి పరిసర ప్రాంతాల్లో ఎగువన భారీ వర్షం కురిసింది. దీంతో జలాశయానికి ఇన్ఫ్లోస్ పెరగడంతో గురువారం నీటిమట్టం 1035.70 అడుగులకి పెరగడంతో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8 గంటలకు 6 వేలు క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేసామన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల సమయానికి నీటి మట్టం1034.30 అడుగులకు తగ్గుముఖం పట్టడంతో నీటి విడుదలను 6వేల క్యూసెక్కుల నుంచి నుంచి 2 వేల క్యూసెక్కులకు తగ్గించినట్లు ఆయన తెలిపారు. అలాగే విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం పోల్లూరు జల విద్యుత్ కేంద్రానికి డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ఎపి జెన్కో ఎఇఇ శివశంకర్ తెలిపారు.



పిఒ శుభంనొక్వాల్‌కు వినతిపత్రం ఇస్తున్న రవీంద్ర

నిధుల దుర్వినియోగం చేసిన వారిపై చర్యలేవీ?

- ఐటిడిఎ పిఒకు వినతిపత్రం

ప్రజాశక్తి-చింతూరు: కూనవరం పంచాయతీ నిధులు దుర్వినియోగాన్ని త్వరగా బయటపెట్టి ఆ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెరపాటి రవీంద్ర చింతూరు ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్‌కి వినతిపత్రం అందించారు. నిధుల దుర్వినియోగం జరిగిందని అంత స్పష్టంగా కనిపిస్తున్నా విచారణ పేరుతో కాలయాపన చేయడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఇంతకాలం ఉపసర్పంచ్‌ను సర్పంచ్‌గా కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమని, ఆరు నెలల్లో ఎలక్షన్ పెట్టకుండా సర్పంచ్‌గా ఎలా కొనసాగించారని, వెంటనే సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం పూర్తి సమాచారం కావాలని అధికారులను కోరారు. విచారణ అధికారులపై అనేక అనుమానాలు ఉన్నాయని కూడా ఫిర్యాదు చేశారు. పిఒ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో త్వరగా విచారణ జరిపించి అవినీతికి పాల్పడినట్లు తేలితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్రామసభలో పనులు ఆమోదం

ప్రజాశక్తి - గంగవరం: మండలంలోని గంగవరం పంచాయతీ కార్యాలయంలో ఆది కర్మయోగి ప్రత్యేక గ్రామసభ నిర్వహించడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమానికి సర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షత వహించారు. గ్రామంలో గతంలో నిర్వహించిన ట్రాన్సక్ట్ వాక్‌లో గతంలో గుర్తించిన పనులు ఆమోదం, 2029కి సంబం ధించి గ్రామయాక్షన్ ఆమోదించారు. సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై గ్రామసభలో అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కూటమి నాయకులు మాజీ ఎంపిపి తీగల ప్రభ, మాజీ ఎంపిటిసి కోసు బుల్లియమ్మ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

అసంపూర్తిగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్



కొర్రాయిలో పనులు పూర్తవక నిరుపయోగంగా హెల్త్‌వెల్‌నెస్ సెంటర్

ప్రజాశక్తి- డుంబ్రిగుడ : కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కొర్రాయి సబ్ సెంటర్ పరిధి గిరిజనులకు వైద్య సేవలు అందించేందుకుగాను ప్రభుత్వం ప్రతి సబ్ సెంటర్ కేంద్రాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను మంజూరు చేసింది. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో గిరిజనులకు ఉపయోగం లేని పరిస్థితి ఏర్పడుతుంది. కొర్రాయిలో నూతనంగా మంజూరైన సబ్ సెంటర్ భవనాన్ని గత మూడేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ భవన నిర్మాణం చేపట్టి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తుంది. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన ఈ భవనాలు అసంపూర్తిగా వదిలేయడంతో గిరిజనులకు ఎటువంటి ఉపయోగం ఉండటం లేదని ఆ ప్రాంత గిరిజనులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని పూర్తి నిర్మాణ పనులు చేపట్టి ప్రారంభించాలని గిరిజనులు కోరుతున్నారు.

'గీతం' మూర్తికి ఘననివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి-మధురవాడ : గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) విద్యాలయ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎంవివిఎస్.మూర్తి వర్ధంతిని పురస్కరించుకుని గీతంలోని డాక్టర్.మూర్తి స్మృతివనం వద్ద గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ, సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి పారిశ్రామిక, రాజకీయ, విద్యారంగాలలో డాక్టర్ ఎంవివిఎస్ మూర్తి తనదైన ముద్ర వేశారన్నారు. గాంధీజీ స్ఫూర్తితో గీతం వర్సిటీని స్థాపించి ఎందరికో విద్య,వైద్యం అందించారన్నారు. జీవితంలో విజయాలను, అపజయాలను సమంగా స్వీకరించడం, అంకితభావం, కష్టపడేతత్వం గీతం.మూర్తి నుంచి నేర్చుకోవాల్సిన విషయాలన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.గంగాధరరావు గీతం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జీఎస్‌బి ప్రొ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.గీతాంజలి, వివిధ కళాశాలల డీన్‌లు, ప్రిన్సిపాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని డాక్టర్.మూర్తికి నివాళులర్పించారు.

వైభవంగా సింహాద్రి అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేసిన అర్చక స్వాములు, భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చేసి, పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కల్యాణోత్సవం కమనీయంగా జరిపించారు. వేడుకలో భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామి ప్రసాదాలను అందజేశారు. అనంతరం అంతరాలయ దర్శనం కల్పించారు.

ఆశాజనకంగా ఎర్ర ముల్లంగి

సాగుపై గిరిజన రైతుల ఆసక్తి



తీసిన ఎర్ర ముల్లంగిని శుభ్రం చేస్తున్న యువ రైతు



సాగుచేసిన ఎర్ర ముల్లంగిని భూమిలోంచి తీసిన గిరిరైతులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏజెన్సీలోని ప్రాంతంలో గిరి రైతులు ఎర్ర ముల్లంగి పంటను కొత్తగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న తెల్ల ముల్లంగి పంట కన్నా ఎర్ర ముల్లంగి పంట ధర మార్కెట్లో ఎక్కువగా ఉండటంతో మండలంలోని పలు గ్రామాల్లో గిరి రైతులు సాగు చేస్తున్నారు. తెల్ల ముల్లంగి కావిడి ధర రూ 700లు ఉండగా ఎర్ర ముల్లంగి కావిడి ధర రూ 900లు ఉంది. దీంతో మండలంలోని కూరగాయలు సాగు చేసే రైతులు ఎర్ర ముల్లంగి పంటపై దృష్టి సారించి ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఒడిశా నుంచి హైబ్రిడ్ విత్తనాలను తీసుకొచ్చి ఇక్కడ సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. మండలంలో కొర్రాయి, కొల్లా పుట్టు, సొవ్వా, సాగర, కురిడి, రంగిలి సింగి పంచాయితీ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఈ ఎర్ర ముల్లంగి పంటను గిరి రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి ఈ పంటను కొత్తగా సాగు చేస్తున్నట్లు రైతులు ఉంటున్నారు. ఈ పంటకు గిరాకీ ఉండటంతో వీటిని సాగు చేస్తున్న రైతులు అరకు, కించుమండ సంతల్లో తరలించి విక్రయాలు సాగిస్తున్నారు. ఈ ఎర్రముల్లంగి అచ్చం తియ్యదుంప రంగు మాదిరిగా ఎర్రగా ఉంటుంది. దీంతో మార్కెట్లో కూడా కొత్తగా దిగడంతో కొనుగోలు చేసేవారు ఆసక్తిగా కొనుగోలు చేసుకుంటున్నారు.

గ్రామసభల్లో అభివృద్ధి పనుల గుర్తింపు



అనంతగిరిలో మాట్లాడుతున్న పీడీ



చింతపల్లిలో మాట్లాడుతున్న సర్పంచ్

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు గుర్తించేందుకు గ్రామ సభల ద్వారా సాధ్యపడుతుందని ఎంజిఎన్ఆర్ఇజిఎస్ డ్వామా పీడీ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని బిల్లకలగెడ్డ పంచాయతీ సచివాలయంలో స్థానిక సర్పంచ్ మజ్జి అప్పారావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు హాజరైన పీడీ మాట్లాడుతూ, పంచాయతీ గ్రామ సభ ద్వారా అనేక సమస్యలు పరిష్కారం సాధ్యం పడుతుందని తెలిపారు.వివిధ అభివృద్ధి పనులు గుర్తించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా సద్వినియోగ పరచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్‌రావు, ఏపీఓ అర్జున్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి : చింతపల్లి మేజర్ పంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజల భాగస్వామ్యంతోనే ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు వేగంగా సాగుతాయని సర్పంచ్ దురియా పుష్పాలత అన్నారు. చింతపల్లి మేజర్ పంచాయితీ పరిధి సచివాలయం–1లో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పలత, పంచాయతీ ఇన్‌ఛార్జ్ సెక్రెటరీ అంబేద్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొదలుగా చింతపల్లి 1, 2, 3 సచివాలయాల ఉద్యోగస్తులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. తరువాత ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల ప్రజలు, కూటమి నాయకులు కలిసి సుమారు మూడు గంటల పాటు పంచాయతీ పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై లోతుగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, ఉపాధి హామీ పథకం కింద త్వరలో చేపట్టబోయే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గ్రామసభలో నిర్ణయించారు. జాతీయ రహదారిపై పశువులను విచ్చలవిడిగా వదిలేసే యజమానులపై కఠిన చర్యలు తీసుకునేందుకు తీర్మానించారు. సీజన్‌లో వచ్చే అంటువ్యాధులు నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో చింతపల్లి 1, 2 ఎంపీటీసీలు దారలక్ష్మి, జయలక్ష్మీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సేవ ఈశ్వరమ్మ, పెదిరెడ్ల బేతాళుడు, కిముడు కష్ణమూర్తి, కూటమి నేతలు రీమల ఆనంద్, లక్కోజు నాగభూషణం, వంతల బుజ్జిబాబు పాల్గొన్నారు.

విరిగిపడిన భారీ వృక్షాలు



ఈదురుగాలులకు కూలిన వృక్షాలు

ప్రజాశక్తి- అనంతగిరి: తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి అనంతగిరి–అరకు ఘాట్ రోడ్డులో పలుచోట్ల గురువారం మధ్యాహ్నం భారీ వృక్షాలు ప్రధాన రహదారి గుండా మీదుగా నేల కొరిగాయి. గిరిజనుల నివాస గృహాల పై కప్పు రేకులు కుప్ప కూలాయి. అంగన్వాడి కేంద్రం వద్ద భారీ వృక్షాలు విరిగిపడి ధ్వంసం అయ్యాయి. ఘాట్ రోడ్డు శివలింగపురం, తైడా, డముకు. ములియాగూడ, అనంతగిరి, బీసుపురం మీదుగా అరకు మండలం సుంకరమెట్ట వరకు భారీ వృక్షాలు విరిగి పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం స్థానికుల సాహాయంతో వృక్షాలను తొలగించారు. పెదకోట పంచాయతీ మద్రేపు గ్రామానికి చెందిన కొండ తాబేలు, ఆనంద్ కు చెందిన ఇల్లు పైకప్పు, రేకులు ధ్వంసమయ్యాయి. లుంగపర్తి పంచాయతీ పెద్దబయలులో ఇల్లు, పులుసుమాడి గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రం పై వృక్షాలు విరిగిపడి ధ్వంసమయ్యాయి.

ఈదురుగాలులకు రూ.1.78 కోట్ల నష్టం

- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు
- ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ ఇమ్మడి

ప్రజాశక్తి- సీతమ్మధార : భారీవర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో ఎపిఇపిడిసిఎల్ పరిధిలో విద్యుత్‌లైన్లకు రూ.1.78కోట్ల నష్టం వాటిల్లిందని సంస్థ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామన్నారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లా పాడేరు ఆరు సర్కిళ్ల పరిధిలో విద్యుత్ లైన్లపై భారీ వక్షాలు, చెట్టుకొమ్మలు, ఫ్లెక్సీ బ్యానర్లు, విరిగిపడిన కారణంగా 33 మండలాలు, 314 గ్రామాల్లో 1,84,328 సర్వీసు కనెక్షన్లకు, 2,126 వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడిందన్నారు. 1700 మంది సిబ్బంది 170బృందాలుగా విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేస్తున్నారన్నారు.దసరా సెలవు అయినప్పటికీ, విద్యుత్ సిబ్బంది సమిష్టిగా పునరుద్ధరణ చర్యల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ మేరకు టెలీకాన్ఫరెన్స్‌లో సిబ్బంది అప్రమత్తం చేసి చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యుత్తు అంతరాయాలకు సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోలు రూమ్ ఫోన్ నెంబర్లు శ్రీకాకుళం 9490612633, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, పార్వతీపురం మన్యం 8331983217, సంబంధిత సెక్షన్ కార్యాలయాలకు తెలియచేసి పరిష్కారం పొందవచ్చని సిఎండి పృథ్వీతేజ్ వినియోగదారులకు విజ్ఞప్తి చేసారు.

సమయపాలన పాటించాలి : డిఎంహెచ్ఓ


ప్రజాశక్తి- సీతమ్మధార: వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి, రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని, విధిగా ముఖ హాజరు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు.. శుక్రవారం రేవిడి, శొంఠ్యాం పిహెచ్‌సిలతోపాటు బుచ్చిరాజుపాలెం, లక్ష్మినగర్, మారికవలస, స్వతంత్ర నగర్, మిధిలాపురి వుడాకాలనీ, వాంబే కాలనీ యుపిహెచ్‌సిలను ఆకస్మికంగా సందర్శించారు. వైద్యసేవలు అందుతున్న తీరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అభ ఐడి రిజిస్ట్రేషన్, ఎన్ఎంల సేవలను సమీక్షించారు. గర్భిణుల సేవలు, ఎన్‌సిడి 4.0 స్క్రీనింగ్, సాధ్యమైనంత వరకు అందరికీ అందుబాటులో ఉండాలని, ఇహెచ్ఐఆర్, ఐహెచ్ఐపి, ఆర్‌సిహెచ్ కూడా నమోదు చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేసారు. జిఎస్‌టి సవరణలతో ఆరోగ్య రంగంలో చేకూరిన ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.



జలదీక్ష చేస్తున్న మల్లెతోట గిరిజన గ్రామస్తులు

పోలవరం పరిహారం చెల్లించాలని జలదీక్ష

ప్రజాశక్తి -చింతూరు: పోలవరం పరిహారం రోజురోజుకీ ఆలస్యం అవుతున్న కారణంగా ప్రతి సంవత్సరం వరదలకు తమ గ్రామంలోని నివాసాలు పంట పొలాలు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లుతోందని త్వరితగతిన పోలవరం పరిహారం అందజేసి పునరావాసం కల్పించాలని మల్లెతోట గిరిజన గ్రామస్తులు గురువారం వరదనీటిలో దిగి 5 గంటల పాటు జలదీక్ష నిర్వహించారు. ప్రభుత్వం కేవలం సర్వేలు చేయటంతోనే కాలయాపన చేస్తోందని పునరావాసం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని దాంతో ముంపు గ్రామస్తులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. పరిహారం చెల్లించి పునరావాస కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని లేని పక్షంలో దశల వారి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

'గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఏజెన్సీ ప్రాంత అభివద్ధికి కూటమి ప్రభుత్వం కషి చేస్తోందని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మండలంలో కిర్రాబు పంచాయతీ రూ 38 లక్షలతో, మొల్లిమెట్టలలో రూ.12 లక్షలతో అంగన్‌వాడి భవనం, రూ.50 లక్షలతో మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శిరీషదేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, విద్యుత్ వంటి మౌలిక వసతులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కిర్రాబు ఆనకట్ట నిర్మాణానికి అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడంతో పాటు, ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు, ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, ఎఎంసి కమిటీ డైరెక్టర్ శివ, ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు, సిడిపిఒ సుజాత, ఎఒ చక్రధర్ మాజీ సొసైటీ అధ్యక్షుడు గణాజల తాతారావు, జనసేనపార్టీ మండల అధ్యక్షులు బొదిరెడ్డి త్రిమూర్తులు, బిజెపి మండల అధ్యక్షులు తాము సూరిబాబు, ఎంపిటిసి నల్ల సత్తిబాబు, కూటమి నాయకులు శెట్టి సుబ్బారావు, నవదీప్ పాల్గొన్నారు.

53 అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడి హెల్పర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి కె.వి.రామలక్ష్మి తెలిపారు. భీమునిపట్నం డివిజన్ భీమునిపట్నం ప్రాజెక్టు పరిధిలో 11, విశాఖపట్నం డివిజన్ పరిధిలో పెందుర్తి ప్రాజెక్టులో 21, విశాఖపట్నం ప్రాజెక్టు పరిధిలో 21, మొత్తం 53 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. స్థానిక నివాసం కలిగిన వివాహిత స్త్రీలు, ఏడోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, ఈ ఏడాది జులై ఒకటో తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి14 వ తేదీ వరకు సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులను, విద్యార్హతలు, కులం, నివాసం వగైరా వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నోటిఫికేషన్, దరఖాస్తు ఫారంల కోసం https/visakhapatnam.ap.in చూడవచ్చు అన్నారు.

భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధం కండి

- ఆదివాసీ హక్కులు, ఉద్యోగుల సాధన కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న సిరిమల్లిరెడ్డి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఏజెన్సీలో అదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని చంద్రబాబు ప్రభుత్వం 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకు అని హామీ ఇచ్చి అదివాసీల గొంతు కోసారని ఆదివాసీ హక్కులు ఉద్యోగాలు సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు సిరిమల్లి రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం సాధన కమిటీ మండల అధ్యక్షులు జి.లోవప్రసాద్ అధ్యక్షతన రాజవొమ్మంగిలో ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సిరిమల్లెరెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ ఉద్యోగాలపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా, ఆందోళనలు చేపట్టినాకనీసం ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. ఆదివాసి జెఎసి జిల్లా నాయకులు వంతు బాలకృష్ణ మాట్లాడుతూ ఆదివాసీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వేలాది మంది చదువుకున్న నిరుద్యోగ యువత పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో శతశాతం ఉపాధ్యాయ పోస్టులకు గిరిజనులకే ఇవ్వాలని, ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు టి.వరప్రసాద్, వెంకటరమణ, పి. రాజకుమార్, డి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

- సిపిఎం బృందం



వరిపైరు పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి-విఆర్‌పురం: వరి నాట్లు వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ములకనపల్లి పంచాయతీ జల్లివారిగూడెంలో ముంపునకు గురైన పొలాలను వారు పరిశీలించారు. సర్పంచ్ మారయ్యతో పాటు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు ఇతర నాయకులు మాట్లాడుతూ శబరి, గోదావరి పొంగటంతో ఎకరానికి 15 నుండి 20 వేలు వరకూ ఖర్చు అయిందని వరద తగ్గినప్పటికీ వరి పనికిరాదని తక్షణమే రూ.30 వేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జల్లి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూసాగుకు స్థానిక ఆదివాసీలకే అవకాశం ఇవ్వాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



పిఒకు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు

ప్రజాశక్తి - చింతూరు: పోలవరం పరిహారం పొంది స్థానికంగా లేని గిరిజనేతర భూస్వాముల ఆధీనంలో ఉన్న భూముల సాగుకు స్థానిక ఆదివాసీలకు కల్పించాలని శుక్రవారం చింతూరు ఐటిడిఎ వద్ద ఎటపాక, విఆర్‌పురం మండలాల ఆదివాసీలు ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పిఒ శుభంనొఖ్వాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పిఒ జారీ చేసిన సర్క్యులర్‌పై వివరణ కోరగా ఆయా భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉండడం మూలాన ప్రస్తుతం ఎవరు సాగుదారులుగా ఉన్నారో విచారణ జరిపి, 20 రోజుల్లో తెలియపరు స్తామని అప్పటివరకు ఇరుపక్షాలు ఆ భూముల్లోకి వెళ్ళకూడదని తెలిపారు. నష్టపరిహారం పొందిన భూములన్నింటిపై నాలుగు మండలాల్లో విచారణ జరిపిస్తామని ఆదివాసీలకు హామీ ఇచ్చారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులిసంతోష్ కుమార్ జిల్లా నాయకులు సీసం సురేష్ కాక అర్జున్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 5 శాతం షెడ్యూల్ ఏరియాలో ఆదివాసులకు భూమిపై సర్వహక్కులు ఉంటాయన్నారు. స్థానికంగా లేని గిరిజనేతల భూస్వాములు పరిహారం తీసుకొని తిరిగి ఆ భూములపై కౌలు పేరుతో లబ్ధి పొందుతున్నారని ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల పట్ల సవితి తల్లి ప్రేమను ప్రదర్శిస్తుందని ఈ ప్రాంతంలోనున్న గిరిజన రైతులకు పరిహారం ఇచ్చిన రైతులకు పునరావాసం కల్పించడం భూములు కోల్పోయే రైతులకు భూములు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రతి ఏడూ పోలవరం నిర్వాసితులు గోదావరి శబరి ప్రాంత రైతులు ప్రతి ఏడాది వరదల ముంపుతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తక్షణమే ఈ ప్రాంత రైతాంగానికి పరిహారం పునరావాసం సాగుకు అనువైన భూమిని కేటాయించి ఈ ప్రాంత ప్రజానీకానికి న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సోందే రామారావు, పులిరాజు, వీరమ్మ, బాబు, కోర్సా రాంబాబు, పోడియం శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సుల రద్దుతో ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి -సీలేరు: విశాఖ డిపోకు చెందిన విశాఖ సీలేరు నైట్ హాల్ట్, నర్సీపట్నం డిపోకు చెందిన నర్సీపట్నం వయా చింతపల్లి మీదుగా సీలేరు వెళ్లే బస్సు ఆర్టీసి అధికారులు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సీలేరు బస్టాండ్‌లో బస్సులు కోసం ఎదురుచూస్తూ పడిగాపులు పడ్డారు. దసరా సెలవులు గురువారంతో ముగియడంతో మైదాన ప్రాంతం నుంచి పాఠశాలకి హాజరు కావాల్సిన ఉపాధ్యాయులు, సిబ్బంది నానా అవస్థలు పడ్డారు. నర్సీపట్నం వయా సీలేరు వెళ్లి తిరిగి వయా నర్సీపట్నం మీదుగా అనకాపల్లి వెళ్లే బస్సు సర్వీస్ దారకొండ ఘాట్‌రోడ్లో మరమత్తులకు గురై శుక్రవారం ఉదయం నిలిచిపోయింది. విశాఖ వయా నర్సీపట్నం సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే బస్ ఒక్కటే ఆర్టీసీ అధికారులు తిప్పుతుండడంతో రాత్రి సమయంలో ప్రయాణికులు బస్సులో పరిమితికి మించి ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. బస్ సర్వీసులు నిలిచిపోవడంతో సప్పర్ల, ధారకొండ, గాలికొండ గుమ్మిరేవులు దుప్పిలివాడ సీలేరు పంచాయతీ పరిధి మారుమూల గిరిజన గ్రామాల్లో పాఠశాలకు ఉపాధ్యాయులు విధులకు హాజరుకాలేని పరిస్థితి నెలకొంది. ఆర్టీసి అధికారులు స్పందించి బస్సు సర్వీసులు నడపాలని డిమాండ్ చేశారు.



గంగవరం మండలం నల్లిపూడి గ్రామ శివార్లలో చెరువు మధ్యలో ఉన్న తుమ్మ చెట్టుపై శుక్రవారం సాయంత్రం నల్లనీటిబాతులు, తెల్ల కొంగలు చెట్టు కొమ్మలపై సేద తీరుతూ కనిపించాయి. అటుగా వెళ్లే వాహనదారులు ఈ దృశ్యాన్ని చూసి పరవశులయ్యారు.
- ప్రజాశక్తి - గంగవరం

వరుస చోరీలకు పాల్పడుతున్న
అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడు అరెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ : విశాఖ నగరంలో వరుస చోరీలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్ కు చెందిన అంతర్రాష్ట్ర ముఠా బవేరియా గ్యాంగు సభ్యుడి ని నగర పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని విశాఖపట్నం క్రైమ్ డిసిపి లతామాధురి తెలిపారు. శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన ఏడు చైన్‌స్నాచింగ్‌లు రెండు బైకు దొంగతనాల కేసుల విచారణలో భాగంగా కంచరపాలెం క్రైమ్ విభాగం పోలీసులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం , అల్లావుద్దీన్పూర్ గ్రామానికి చెందిన ధర్మేంద్రకుమార్ (34) అనే అంతర్రాష్ట్ర ముఠాసభ్యుడిని అరెస్టు చేసి విచారించగా విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తొమ్మిది కేసులతో పాటు ఇతర రాష్ట్రాలైన జమ్మూ కాశ్మీర్లో తొమ్మిది , ఢిల్లీలో ఒకటి, ఉత్తరప్రదేశ్‌లో 11, ఒడిస్సాలో మూడు కేసులతో కలుపు కొని మొత్తం 33 కేసులు అతనిపై ఉన్నాయని ఆరోతరగతి వరకూ చదువుకున్న నిందితుడు ధర్మేంద్రకుమార్ చోరీలు చేయడంలో దిట్ట అని తెలిపారు. ఇతని గ్యాంగ్‌కు సంబంధించి సూరజ్ , కపిల్, హజారేసింగ్‌లను ఇంకా పట్టుకోవాల్సి ఉందని దేశవ్యాప్తంగా అత్యంత ప్రమాదకరమైన బవేరియా గ్యాంగ్ సభ్యుడిగా ఇతనిని గుర్తించారు. ఇతనిపై విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, షీలా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చైన్ స్నాచింగ్ కేసులు నమోదై ఉన్నాయని అలాగే ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్లో ఒకటి, మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి బైకు చోరీ కేసులు ఉన్నాయని ఆమె తెలిపారు. అరెస్టు అనంతరం అతని వద్ద నుండి రూ.70 వేల నగదు ఒక బైకు రికవరీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఇతడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వెస్ట్ ఇన్‌స్పెక్టర్ మీసాల చంద్రమౌళి, కంచరపాలెం ఎస్సై షేక్ అబ్దుల్ మారుఫ్ వారి టీం సభ్యులను ఆమె అభినందించారు.